# షాడో ది స్పై కింగ్

MVS PUBLICATIONS



మధుబాబు

# షాడో ది స్పై కింగ్

(షాడో స్పై థ్రిల్లర్)

రచన

మధుబాబు

*© Author*

*© Madhu Baabu*

*This digital book is published by -*

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# షాడో ది స్పై కింగ్

"త్రీ జాక్స్ కాస్మోపాలిటన్ క్లబ్"

నీలంరంగు నియాన్ లైట్లతో దేవేంద్రలోకంలా మెరిసిపోతోంది.

వచ్చేపోయే కస్టమర్స్‌తో విపరీతమైన రష్‌గా వున్నది బార్ కమ్ రెస్టారెంట్ సెక్షన్.

ఆకుపచ్చరంగు సూట్ ధరించి హడావుడిగా అటూ యిటూ తిరుగుతున్నాడు గోయంకా. త్రీ జాక్స్ యజమాని అతను.

ఉన్నట్లుండి సందడి సద్దుమణిగిపోయింది. సూది క్రింద పడినా వినిపించేటంత నిశబ్దం ఆవరించింది ఆ ప్రదేశాన్ని.

ఆశ్చర్యంతో వెనుతిరిగి చూశాడు గోయంకా.

కనిపించిన దృశ్యం - అతని గొంతు తడి ఆరిపోయేటట్లు చేసింది.

ద్వారంలో నిలబడి వున్నాడొక ఆరడుగుల ఆజానుబాహుడు. నల్లటి టైట్‌పాంట్ వేసుకున్నాడు. గోల్డెన్ చెక్స్ వున్న తెలుపురంగు షర్టును టక్ చేశాడు. ఆకుపచ్చ రంగు కూలింగ్ గ్లాసెస్‌లో నుంచి గోయాంకా వంకే చూస్తున్నాడు సూటిగా.

తన గుండెలను ఏదో తెలియని మంచు హస్త మొకటి పట్టుకొని పిండేస్తున్నట్లు అనుభూతి చెందాడు గోయంకా. పెదిమలు ఎండిపోయాయి. నుదుటిమీద స్వేదబిందువులు ఆవిర్భవించాయి.

నిగనిగలాడుతున్న హై హీల్ పాయింటెడ్ బూట్లు ధరించివున్నాడా వ్యక్తి. గోయంకా దృష్టి అతని చీలమండలమీదికి ప్రసరించింది. పాంటు కిందనుంచి కనిపించీ కనిపించకుండా కనిపిస్తున్నది ఆరంగుళాల డాగర్ మొన.

మెడమీద ఎవరో గుద్దినట్లు జలదరించింది గోయంకా శరీరం. నియాన్ లైట్ల వెలుగుపడి వింతగా మెరిసిపోతోంది ఆ వ్యక్తి ధరించిన టెరీకాటన్ షర్టు. గోయంకా కళ్ళు షర్టు అందాల్ని చూడటం లేదు. ఆ షర్టు కింద ఆ వ్యక్తి ఎడమచేతికి సమీపంలో దాగుకొని వుంది .44 కాలిబర్ రివాల్వర్. ఏ క్షణంలోనైనా బయటికి రావచ్చది.

జ్వరం వచ్చినట్లు వణికిపోయాడు గోయంకా.

పాంటు జేబులోనుంచి పనామా పాకెట్ తీశాడా వ్యక్తి. ఒక సిగరెట్ని నోటిలో పెట్టుకుంటూ ఎడమచేత్తో అగ్గిపుల్ల వెలిగించాడు.

ఆరిపోయిన అగ్గిపుల్లను అతి విలాసంగా వేలితో మీటాడు. బాణంలా వచ్చి గోయంకా పాదాలముందు పడిందా మేచ్స్టిక్.

గోయంకా గుండెలు పట్టుకుపోయాయి. తెరలు తెరలుగా బయటికి దుమకబోయిన ఏడుపును అతి ప్రయత్నం మీద అణుచుకున్నాడు.

"నా కోసం మనుషుల్ని పంపించి వెతికిస్తున్నావుట. నిజమేనా?"

పనామా పొగను రింగులు రింగులుగా వదులుతూ అడిగాడా వ్యక్తి. ఆ గంభీర కంఠం ఖంగుమంటూ ప్రతిధ్వనించింది ఆ బార్ రూమ్‌లో.

మాట్లాడలేదు గోయంకా. నోరు తెరిచిన మరుక్షణం తనకు పుట్టగతులు ఉండవని అతనికి తెలుసు.

"గోయంకా! పెద్దవాడివై పోయావని మిడిసిపడకు. కావాలని అనుకుంటే క్షణంలో నిన్ను నీ క్లబ్‌నీ నేలమట్టం చేయగలను. నన్ను అడ్డుకునే దమ్ము నీకుగాని, నీకు ధనసహాయం చేసి పోషిస్తున్న నీ బాస్‌లకుగాని లేదు"

గోయంకా కోటుజేబులో చిన్న పిస్టల్ వుంది. దాన్ని అందుకొని క్షణంలో ఆ వ్యక్తిని యమసదనానికి పంపించవచ్చు. పిస్టల్ చిన్నదే అయినా దాని బుల్లెట్ ఒకటి చాలు అతని ప్రాణాలు తీయటానికి.

బార్‌రూమ్‌లో గోయంకా అనుచరులు పాతికమంది ఉన్నారు. వారందరి దగ్గరా అటువంటి ఆయుధాలే వున్నాయి. అతను కనుసైగ చేస్తే చాలు. ఆ వ్యక్తి శరీరాన్ని తూట్లు పడగొట్టారు.

ఆ రెండు పనులు చేయటానికి ధైర్యం లేకపోయింది. తనముఖంలో ఏమాత్రం మార్పు కనిపించినా... ఆ వ్యక్తి అన్నంతపనీ చేస్తాడని గోయంకాకు తెలుసు.

సగం కాలిన పనామాను ఎడమచేత్తో గోయంకా మీదికి విసిరాడా వ్యక్తి. సూటిగా వచ్చి కోటుజేబులో పడిందది.

టెరీన్‌కోటు క్షణాలమీద అంటుకొని పొగలు వెలువర్చటం ప్రారంభించింది. గోయంకా మోకాళ్ళు గజగజ వణకటం ప్రారంభించాయి. కోటును విప్పటానికి వీలులేదు. జేబులో చేయిపెట్టి ఆ సిగిరెట్ పీకను బయటికి తీయటానికి అవకాశం లేదు.

ఏమాత్రం కదలిక కనిపించినా ఆ వ్యక్తి బూటుకు బిగించి వున్న డాగర్ తనగుండెల్లో దిగబడి రక్తాన్ని చవిచూస్తుందని గోయంకాకు తెలుసు.

"ఏం బే గోయంకా? నన్ను చంపి నా చెవులను గుర్తుగా చూపించినవారికి పదిలక్షల బహుమతి ఇస్తానని ప్రకటించావుట... వచ్చాను చూడు! నన్ను చంపి ఆ పనేదో నువ్వే చేయరాదు?"

నోరు విప్పలేదు గోయంకా. పెదిమ కదలించలేదు. కోటు సగం మాడిపోయి మంటలు ప్రత్యక్షం కాబోతున్నాయి.

అది గమనించి వినోదంగా నవ్వాడా వ్యక్తి.

ఆ బార్‌రూమ్‌లో అనేకమంది లేడీస్ వున్నారు. అంతవరకూ అతనొక నరరూప రాక్షసుడిగా అగుపించాడు వారికి. కాని అతని పెదిమలమీద చిరునవ్వు ప్రత్యక్షమైన మరుక్షణం వారి గుండెలు ఝల్లుమన్నాయి. పేరు చెప్పటానికి వీలులేని తీయని తలపులు వారి మనస్సులను ఆక్రమించుకోవటం ప్రారంభించాయి.

"ఆల్‌రైట్ గోయంకా... మొదటిసారి కాబట్టి మాటలతో వదిలేస్తున్నాను. ఈసారి నన్ను వెతకదలుచుకుంటే పాట్నా చాందినీ చౌక్‌లో విచారించు వస్తా!!"

ఎలా వచ్చాడో అలాగే మాయమైపోయాడు ఆ వ్యక్తి. రెండు నిముషాలకు గాని తేరుకోలేకపోయాడు గోయంకా. మంటలు ఎగస్తున్న కోటును విప్పి నేలకేసి బాది ఆఫీసు రూమ్‌వైపు పరుగుతీశాడు.

విశాలమైన టేబిల్‌మీద చిన్న టెలిఫోన్ వుంది. వణుకుతున్న చేతులతో రిసీవర్ని ఎత్తి ఒక నెంబర్‌కిడయల్‌చేశాడు.

"హల్లో! ఎవరిది? బాస్? బాస్... నేను గోయంకాను మాట్లాడుతున్నాను. ఇందాక షాడో వచ్చాడు. నన్ను బెదిరించి పోయాడు. బాస్! పాట్నా చాందినీ చౌక్‌లో ఉంటానని చెప్పి వెళ్ళాడు. వెంటనే మనుష్యుల్ని పంపించండి"

అవతలినుంచి వినవచ్చిన మాటలు అతని ముఖాన్ని ప్రకాశవంతం చేశాయి. "థాంక్యూ బాస్... థాంక్యూ వెరీమచ్" అంటూ రిసీవర్‌ని క్రెడిల్‌చేసి టేబిల్‌మీద వున్న కాలింగ్‌బెల్ నొక్కాడు.

మరుక్షణం ఆఫీసు గదిలోకి అడుగుపెట్టారు పదిమంది దృఢకాయులు. "షాడో చాందినీ చౌక్‌లో ఉంటానన్నాడు. అతన్ని చంపిన వారికి ఇరవై లక్షల రూపాయలిస్తాను - మన గాంగ్ ప్రకటించిన బహుమతికాక ఎక్‌స్ట్రాగా."

పెదిమలు తుడుచుకుంటూ వెనుతిరిగారా పదిమందీ.

పదినిముషాల అనంతరం నాలుగు అంబాసిడర్ కార్లు పాట్నావైపు దూసుకుపోయాయి.

## 2

"సిల్వర్ డాలర్"

చాందినీ చౌక్‌లో వున్న ఒక చిన్న బార్. ఎప్పుడూ రాత్రి మూడుగంటల దాకా కస్టమర్స్‌తో నిండి వుంటుంది. ఆ రోజు పన్నెండు గంటలు వినిపించే సరికి ఖాళీ అయిపోయింది.

అదేకాదు. చాందినీ చౌక్ వీధులన్నీ నిర్మానుష్యమైపోయాయి. నాలుగు అంబాసిడర్లు మాత్రం విసుగూవిరామం లేకుండా ఆ వీధుల్లో తిరుగుతున్నాయి.

బార్ కౌంటర్ వెనుక నిలబడి గోడ గడియారంవైపు చూశాడు నందలాల్. ఒంటిగంట కావస్తున్నది.

గడియారం మీదినుంచి అతని చూపులు బార్ చివర గోడను ఆనుకొని కూర్చున్న దృఢకాయుడి మీదికి ప్రసరించాయి.

అదే సమయంలో నందలాల్‌వైపు చూశాడా వ్యక్తి.

నందలాల్ మోకాళ్ళు చచ్చుపడిపోయినట్లు అనిపించింది. ఖంగారుగా దృష్టి మరలించుకొని, హడావుడిగా కౌంటర్ గ్లాసులను క్లీన్ చేయటం ప్రారంభించాడు. అతని చెవులు బార్ ముఖద్వారంవైపు కేంద్రీకరించి వున్నాయి.

షాడో కనిపించగానే తెలియచేయాలని ఆర్డర్లు. అలాగే తెలియచేశాడు. ఆ సంగతి షాడోకు తెలిస్తే తను వెలుగును చూడటం కుదరదు.

కాని షాడో మరణించటం అంటూ సంభవిస్తే !!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=702**

* * *

**Read other books of Mr. Madhubabu @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=20**